# తులసీ రామాయణం అంటే ఇదేనా?

కూర్పు

**యలమంచిలి వెంకటప్పయ్య**

**గాంధీ సామ్యవాద పుస్తకమాల**

మధు నగర్ : : విజయవాడ-10

# తులసీ రామాయణం అంటే ఇదేనా?

కూర్పు

**యలమంచిలి వెంకటప్పయ్య**

**గాంధీ సామ్యవాద పుస్తకమాల**

**మధు నగర్ : : విజయవాడ-10**

ప్రచురణ : మే, 1987
ప్రతులు : 500

వెల : రు. 6–00

ముద్రణ :
నాగార్జున ఎంటర్‌ప్రైజెస్,
విజయవాడ – 520 004.

# మనవి

## తులసీ రామాయణం అంటే ఇదేనా?

తులసీ రామాయణము యొక్క నిజస్వరూప - లక్ష్యాలను క్షుణ్ణముగా పరిశీలించి పదిమంది పామరజనానికి తేలికగా తెలిసేలాగున నిష్పక్షపాత– న్యాయ దృష్టితో విమర్శించిన హిందీ కవుల, లేఖకుల పేర్లు :

1. గంగా సహాయ్ ప్రేమీ
2. చంద్రశేఖర్ శుక్ల
3. భదంత్ ఆనంద్ కౌసల్యాయన్
4. యమునాదత్ వైష్ణవ "అశోక్"
5. రామప్రియా శరణ్ సింహా "రత్నేశ్"
6. రామసాగర్ వర్మ
7. లక్ష్మీనారాయణ
8. సచ్చితానంత మిశ్ర
9. సుదర్శన 'చోపడా'

# ముందుమాట

ఉత్తర భారత ప్రాంతంలో హిందీ కవులలో సూరదాసు, తులసీదాసు యీ ఇద్దరూ గొప్ప భక్త కవులలో ముఖ్యులుగా ఎంచబడుతున్నారు. వీరిద్దరూ హిందూ సంస్కృతిలో – ఆచారాలలో పుట్టి పెరిగినవారే. ఇద్దరూ హిందూ సంస్కృతికి జుట్టు, బొట్టు, కట్టు, మొదలగు బయటకు కన్పించే గుర్తులకు ఎక్కువ విలువ యిచ్చినవారే. అందువల్ల యీ ఇద్దరూ ఎంతసేపూ బయటకు కన్పించే జుట్టు, బొట్టు మొదలగు సంకుచిత హిందూ సంస్కృతినే సామాన్య ప్రజానీకానికి బోధించారు.

ఈ సంకుచిత హిందూ సంస్కృతికి పునాది బ్రాహ్మణవాదమే ననియు, బ్రాహ్మణులు లేనిదే హిందూ సంస్కృతి లేనేలేదనియు వీరి వాదన. అంటే హిందూ సంస్కృతికి బ్రాహ్మణులే ప్రాణమువంటివారని వీరి దృఢ నమ్మకం. అందువలన ఈ ఇద్దరు కవుల రచనలలోనూ బ్రాహ్మణవర్ణం యొక్క గొప్పతనం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఈ విషయాలలో సూరదాసు కంటె తులసీబాబాయే రెండడుగులు ముందుకు వెళ్ళాడనక తప్పదు. ఎందుకనగా తులసీ బాబా తన బ్రాహ్మణవర్ణాన్ని ఆకాశానికి ఎత్తి తక్కిన వర్ణాలవారిని ముఖ్యంగా శూద్రులనబడే వారిని, ఆడవాళ్ళను పాతాళానికి అణగద్రొక్కాడనుట నూటికి నూరు పాళ్ళు చేదు నిజము.

తులసీ బాబా సూరదాసువలె ఇంద్రియ నిగ్రహము, స్థిరబుద్ధి ఓర్పు గలవాడుగా కన్పించడు. ఎట్లనగా తులసీ బాబా గృహస్థుగా వున్న రోజులలో ఎక్కువ కామాతురుడై వుండేవాడట, ఆయన మితిమీరిన కామాతురతను చూచి వివేకవంతురాలైన ఆయన ఇల్లాలు ఆయనను మంచి మాటలతో మందలించగా ఆయన కోపంతో అలిగి యింటి నుండి లేచిపోయి దొంగ

సన్యాసియై తన యిల్లాలు మీద కలిగిన కోపాన్ని, ద్వేషాన్ని మొత్తం ఆడ సమాజం మీద చూపించి తన కసి తీర్చుకున్నట్లు కన్పిస్తాడు. ఇంతేకాదు తులసీ బాబా హిందువులను ముఖ్యంగా శూద్రులనబడే వారిని చిన్న చిన్న ముక్కలు ముక్కలుగా (కులాలుగా) చేసి వారిని ఆర్థికంగానూ, సాంఘికంగానూ బలహీన పరచడమే కాకుండా వారిని బౌద్ధికంగా కూడా (తెలివితేటలతో) ఆలోచనల లేని పశువులుగా వుంచటానికి తోడ్పడే కుటిల వర్ణవ్యవస్థను సుస్థిరంగా ఉంచే పునాదులు వేయడానికి తన శక్తికొలది ప్రయత్నించాడు అందువల్ల తక్కిన కులాల వారు ముఖ్యంగా శూద్రులనబడేవారు అందరూ బ్రాహ్మణులే తమను సర్వవిధాల రక్షించే భూలోకదేవతలని యెంచి వారిని పూజింపసాగారు. ఇంకా టూకీగా, సూటిగా చెప్పాలంటే తులసీ బాబా తన బ్రాహ్మణవర్ణమే కొన్ని తరాల వరకు హిందూసమాజాన్ని అన్ని విధాలా నడపగలగటానికిగాను గట్టి పునాదిని వేశాడనుట అబద్ధం కాజాలదు. అందువల్ల యీ చిన్న పొత్తములో తులసీ బాబా తన "రామచరితమాస" అనే హిందీ రామాయణముద్వారా బహుళ హిందూసమాజానికి అంటే శూద్రులనబడే వారికి, ఆడవాళ్ళకు చేసిన గొప్ప అపచారాన్ని అన్యాయాన్ని గురించి తెలుగు మాటలలో సామాన్య చదువుగల చదువరులకు కూడా తేలికగా తెలిసేలాగున యీ చిన్న పొత్తములో నేను కూర్చాను.

కనుక మంచిచెడ్డలు తెలిసిన చదువరులు ఈ పొత్తాన్ని చదివి చదువులేని తమ అక్కలకు, అన్నలకు, చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు వినిపించి వారిని చైతన్యవంతులుగా (తెలివిగలవారిగా) చేసిననాడు తులసీ రామాయణానికి తులసినీళ్ళు వదలబడతాయి.

**1987** **–యలమంచిలి వెంకటప్పయ్య**

## తులసీ రామాయణం అంటే ఇదేనా?

**నే**టికి సుమారు 4 వందల యేండ్లకు పూర్వం అక్బరు చక్రవర్తి పరిపాలనాకాలంలో తులసీదాసు "రామచరిత మానస" అనే హిందీ రామాయణ కావ్యాన్ని 2 ఏండ్ల, 7 నెలల, 26 రోజులలో వ్రాసి పూర్తి చేశాడట. దానిలో ఆయన ఎన్నో కపోల కల్పితాలు (గప్పాలతో కూడిన), అవిశ్వసనీయమైన (నమ్మదగని అసంగతమైన, ఉచితముగాని), అసంభవమైన (జరగటానికి వీలుగాని), అవకతవక, చౌకబారు సంగతులను వ్రాయటమే కాకుండా, శూద్రులను, ఆడవాళ్ళను ఎంతో నీచంగా నిందించి తన బ్రాహ్మణవర్ణాన్ని ఎంతో గొప్పగా పొగడుకొన్నాడు. వివేకవంతులైన చదువరుల పరిశీలనార్థం ముందుగా అసంభవమైన, అవిశ్వనీయమైన కొన్ని సంగతులను ఉదహరిస్తున్నాను.

తులసీదాసు చిత్రకూట పర్వతం మీద ఒక పూరి గుడిసెలో వుండి "రామ చరితమానస" గ్రంధాన్ని వ్రాస్తూ వున్నప్పుడు ఆ కుటీరాన్ని రాత్రులందు రామలక్ష్మణులు ధనుస్సులను, బాణాలను ధరించి కావలి కాచేవారట. తన యిష్ట దేవతలైన రామ లక్ష్మణులకు తన మూలాన బాధ కలుగుతున్నదని భావించి తులసీదాసు తన కుటీరంలో ఉన్న వస్తువులన్నింటినీ తన చుట్టూ వున్న బీద జనానికి ఊరకే పంచిపెట్టి, "రామచరిత మానస" వ్రాతప్రతిని తన మిత్రుడైన "టోడర్ మల్లు" ఇంటిలో భద్ర పరచాడట.

పండితులు తులసీ రామాయణము యొక్క మహిమను పరీక్షించగోరి "రామచరితమానస" గ్రంథాన్ని వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు మొదలైన గ్రంథాలన్నింటికీ అడుగున ఒక రాత్రి పూట వుంచి మరునాడు తెల్లవారిన తరువాత చూడగా "రామచరిత మానస" గ్రంథం అన్నిటికంటే పైన వున్నదట.

తులసీదాసు మొదట "రామచరిత మానస " గ్రంధాన్ని సంస్కృత భాషలో వ్రాయాలనుకొని కొన్ని శ్లోకాలను వ్రాశాడట. కాని ఒక రాత్రియందు ఆ శ్లోకాలన్నీ కనిపించకుండా మాయమై పోయాయట. కలలో శంకర భగవానుడు తులసీదాసుకు

కన్పించి "నీవు నీ మాతృ భాషయైన హిందీలో రామచరిత మానస" గ్రంథాన్ని రచింపుము" అని ఆదేశించాడట. వెంటనే తులసీదాసు కళ్ళు తెరచి చూడగా, పార్వతీ పరమేశ్వరులు ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యారట. తులసీదాసు వారికి సాష్టాంగ నమస్కారము చేసెనట. "వెంటనే నీవు అయోధ్యకు వెళ్ళి హిందీ రామాయణ మును రచింపుము. అది నా ఆశీర్వాద ప్రభావం వల్ల "సామవేదం" లాగ గొప్ప పేరుగలది కాగలదు" అని ఆదేశించి పార్వతి పరమేశ్వరులు అంతర్ధానమైపోయారట.

త్రేతాయుగంలో రాముడు పుట్టిన యోగంలోనే తులసీదాసు తన రామాయణాన్ని వ్రాయటం ఆరంభించి సరిగ్గా రాముని పెండ్లి ఏ లగ్నంలో జరిగిందో, అదే లగ్నంలో పూర్తిచేశాడట.

తులసీదాసు తన రామాయణాన్ని కాశీవిశ్వనాధునికీ అన్నపూర్ణాదేవికి వినిపించెనట. ఒక రాత్రియందు రామచరిత గ్రంథాన్ని విశ్వనాథదేవాలయంలో వుంచి తెల్లవారిన తరువాత చూడగా, దానిమీద "సత్యం, శివం, సుందరం," అని వ్రాయబడి క్రింద శంకరుని "చేవ్రాలు" కూడా వుండెనట, సత్యం, శివం, సుందరం, అనే ధ్వనిని ఎవ్వరో వినిపించినట్లు తులసీదాసుకు మరి కొందరకు వినబడెనట.

"రామచరిత మానస" గ్రంథాన్ని సాక్షాత్ శంకరుడే వ్రాశాడని తులసీదాసు ఎన్నోచోట్ల వ్రాసుకొన్నాడు.

శంకర భగవానుడు రాముని రూపంలో మానవుని శరీరం ధరించి కేవలం బ్రాహ్మణులను, ఆవులను, సాధువులను రక్షించాడట.

రాముడు పుట్టినపుడు సూర్యుడు సంతోషంతోనూ, ఆశ్చర్యంతోనూ ఒక నెల రోజుల పాటు అయోధ్యలో వుండి పోయాడట. అందుకని అయోధ్యలో ఆ నెల రోజుల పాటు పట్టపగలేనట. సూర్యుడు ఆ నెలరోజులూ రాముని గొప్పతనాన్ని పొగుడుతూ ఉన్నాడట.

నాలుగు వేదాలు శ్రోత్రియ బ్రాహ్మణుల వేషాలు ధరించి బ్రహ్మలోకం నుండి సీతారాముల పెండ్లి పందిరి లోనికి వచ్చి వసిష్ఠునికి పెండ్లి చేయించే విధానాన్ని చెప్పి సీతారాములను ఆశీర్వదించి తిరిగి అందరూ చూస్తుండగానే బ్రహ్మలోకానికి వెళ్లిపోయారట.

రాముని ప్రాణములేని కొయ్య పాముకోళ్ళు భరతుణ్ణి రాజ్యాంగ కార్యకలాపాలలో ఆజ్ఞాపించేవట.

రామునికి భయపడి సముద్రం మానవరూపం ధరించి రాముని యెదుట వినయ విధేయాలతో ప్రత్యక్షమై క్షమాపణ వేడుకొన్నాడట.

రావణుని ఎదురొమ్ములో సీత వుందనియు, సీత హృదయంలో తాను వున్నాననియు తలచి రాముడు రావణుని ఎదురొమ్ము మీద బాణాలు వేయలేక పోయాడట.

వనవాస కాలంలో ఒక రోజున రాముడు సీతతో ఇలా అన్నాడట. "ఓ శీలవతీ ! సీతా!! నేను ఒక సామాన్య మానవుని వలె నటిస్తాను. నేను రాక్షసులందర్నీ చంపి వచ్చే వరకు నీవు అగ్నిలో నివశింపుము." వెంటనే సీత అగ్నిలో ప్రవేశించిందట. ఆమెయెక్క ఛాయా రూపము మాత్రము పర్ణశాలలో వుండెనట. రావణుడు ఛాయారూపియైన సీతను మాత్రమే ఎత్తుకొని పోయాడట. అసలు సీత కాదట. లంకలోని అగ్ని పరీక్ష అసలు సీతకు కాదట.

యుద్ధంలో రామునికి సహాయపడటానికోసం ఇంద్రుడు తన రథాన్ని తన సారధిని లంకా పట్టణానికి పంపాడట.

రాముడు రావణుని భుజాలను, తలలను అనేకసార్లు నరికివేశాడట, కాని తెగిన భుజాలు, తలలు అన్నీ తిరిగి రావణుని వద్దకు చేరుచుండెనట.

రాముని బాణాలు రావణుని భుజాలను తలలను మోసుకొనిపోయి, రావణుని ఇల్లాలైన మండోదరి యెదుట పడవేసి తిరిగివచ్చి రాముని అంబుల పొదిలోని చేరేవట.

రాముడు రావణుని చంపినపుడు బ్రహ్మ ఇంద్రుడు మొదటగు దేవతలు లంకా పట్టణానికి వచ్చారట. వారివెంట పాపం దశరథమహారాజుగారు కూడ వచ్చారట. ఆయన తన కుమారులైన రామలక్ష్మణులను చూచి కన్నీరు కార్చారట. రామ లక్ష్మణులు తమ తండ్రి పవిత్ర పాదాలకు నమస్కరించి తండ్రితో చాలాసేపు యోగక్షేమాలను గురించి ముచ్చటించారట.

రావణుడు చంపబడినపుడు మేఘాలు నెత్తురు, వెంట్రుకలు, దుమ్ము

మొదలగు వాటిని కురిపించాయట. భూమి కంపించిందట. భూమిని మోసే దిగ్గజాలు (ఏనుగులు) సముద్రాలు, నదులు, వ్యాకులం చెందాయట.

రావణుని శరీరం యొక్క మొండెము రెండుగా చీలి ఎలుగుబంటులను, కోతులను పిండి పిండిగా చేసి నేలమీద పడిపోయిందట.

శివుడు ఒక వేయి సంవత్సరాలపాటు అడవులలో దుంపలు తిని, వంద యేండ్లపాటు కూరగాయలను తినీ, కొన్ని రోజులపాటుగాలిని పీల్చుకొని, నీరును త్రాగీ, కొద్ది రోజులపాటు చెట్లనుండి రాలిన ఎండాకులను తినీ తపస్సు చేశాడట.

స్వయంభూ మనువు రాజ్యాధికారాన్ని తన కొడుకు ఉత్తానపాదునకు ఒప్ప చెప్పి తన యిల్లాలు శతరూపను వెంటబెట్టుకొని నైమిషారణ్యానికి వెళ్ళి 6 వేల సంవత్సరాల పాటు నీరు త్రాగి, 7వేల సంవత్సరాల పాటు గాలిని పీల్చుకొని 10 వేల సంవత్సరాల పాటు గాలీ, నీరు లేకుండానూ 203 వేల సంవత్సరాలపాటు ఒంటి కాలిమీద నిలబడి తపస్సు చేశారట.

రావణుడు చావకముందే గాడెదలు, కుక్కలు, నక్కలు, ఏడ్వసాగాయట. ఆకాశంలో తోకచుక్కలు పొడిచాయట. దశదిశలలోనూ అగ్ని మండసాగిందట. సూర్యగ్రహణం సంభవించిందట. విగ్రహాలు ఏడ్వసాగాయట. ఆకాశం నుండి పిడుగులు పడసాగాయట. తీవ్రమైన గాలి వీచెనట.

రాముడు రావణుని చంపినపుడు దేవతలు మునులు, రామునిమీద పూల వర్షాన్ని కురిపించారట.

అసలు సీత అగ్నిలో నుండి సురక్షితంగా బయటకు వచ్చిందట. అప్పుడు సీత పతివ్రతగానూ, పవిత్రమైనది గానూ రుజువైనదట.

కుంభకర్ణుడిని మేల్కొల్పినపుడు రావణుడు అతని కోసం ఒక కోటి కుండల నిండా సారాయిని, కొన్ని వందల కారు దున్నపోతుల మాంసమును తెప్పించెనట,

కుంభకర్ణుడు కోట్లాది కోతులను తిన్నాడట. కోట్ల కొలది కోతులను తన శరీరానికేసి రుద్దుకొని చంపాడట. కోట్ల కొలది కోతులను దుమ్ములో కలిపివేశాడట.

రావణుని తలలు లేని మొండెము "పట్టుకొండి, చంపండి" అని కేకలు పెట్టిందట.

సురసా అనే రాక్షసి హనుమంతుని మ్రింగటానికని తన నోటిని వంద యోజనాల వెడల్పున (3200 మైళ్ళ వెడల్పున) తెరచిందట.

హనుమంతుడు సముద్రం దాటటానికి పర్వతాలమీద ఎక్కగా పర్వతాలన్నీ పాతాళలోకానికి క్రుంగిపోయాయట.

రావణుని శరీరం యొక్క మొండెము ఇలా అరచిందట. “రాముడు ఎక్కడ వున్నాడు? నేను వాణ్ణి యుద్ధంలో చంపుతాను”

రావణుని రాణివాసంలోనికి నక్కలు వచ్చి రావణుని తలలను, భుజాలను తిన్నాయట.

రావణుని ద్వారా చంపబడిన వేలాది ఎలుగుబంట్లు, కోతులు, మొదలగు వాటిని బ్రతికించమని రాముడు ఇంద్రుని కోరగా, ఇంద్రుడు ఆకాశం నుండి అమృతవర్షాన్ని కురిపించాడట. యుద్ధంలో చచ్చిపడివున్న రాక్షసులు, కోతులు, ఎలుగుబంట్లు వగైరాలలో అమృత వర్షం వల్ల కేవలం కోతులు, ఎలుగుబంట్లు మాత్రమే బ్రతికాయట. కాని రాక్షసులు మాత్రం బ్రతకలేదట.

శివుని పెండ్లి పెద్దలు ఒంటినిండా మంచి గంధానికి బదులు నెత్తురు పూసుకొన్నారట. పెండ్లి పెద్దలలో కొందరు కుక్క ముఖాలు, కొందరు పంది ముఖాలు కొందరు గాడెద ముఖాలు కలిగి వున్నారట.

శివుడు పార్వతి ఇద్దరూ తమ కుమారుడైన గణపతిని పూజించారట,

హనుమంతుడు శ్రోత్రియ బ్రాహ్మణుని వేషం ధరించి భరతుని వద్దకు అందరి కంటే ముందుగా వెళ్ళి మాట్లాడాడట.

పార్వతీ పరమేశ్వరుల అనుమతిని తీసికొనే తాను “రామచరిత మానస” గ్రంథాన్ని వ్రాశానని తులసీదాసు వ్రాసుకున్నాడు.

తులసీదాసు దేశాటన చేసేటప్పుడు మానస సరోవరం వద్ద ఆయనకు ఒక భూతము బ్రాహ్మణ వేషంలో కన్పించి ఆంజనేయ స్వామి జాడను తెల్పెనట.

తులసీదాసు ఆంజనేయస్వామి తనకు రాముని దర్శనం చేయించమని వేడుకొనెనట, “చిత్రకూట పర్వతం మీద రాముడు నీకు దర్శనం ఇస్తాడు” అని ఆంజనేయ స్వామి తులసీదాసుతో అన్నాడట.

ఒక రోజున చిత్రకూట పర్వత ప్రాంతంలో తులసీదాసుకు రామలక్ష్మణులు ధనుస్సులను బాణాలను ధరించి గుఱ్ఱాలమీద స్వారీ చేస్తూ కన్పించారట. కాని వారు రామ లక్ష్మణులని తులసీదాసు గుర్తించలేకపోయాడట. తరువాత ఆంజనేయ స్వామి తులసీదాసు వద్దకు వచ్చి రహస్యాన్ని వెల్లడించినపుడు తులసీదాసు చాల పశ్చాత్తప పడ్డాడట. అప్పుడు ఆంజనేయస్వామి తులసీదాసుని ఓదార్చి ఆయనకు త్వరలోనే శ్రీరామచంద్రమూర్తిని దర్శనం చేయిస్తానని చెప్పెనట.

ఆంజనేయస్వామి తులసీదాసు శ్రీరామచంద్రమూర్తి దర్శనం చేయించాడట. ఒకసారి రామచంద్రమూర్తి బాలకుని వేషంలో వచ్చి తులసీదాసుతో ఇలా అన్నాడట, "ఓ బాబా ! నీవు నాకు మంచి గంధమును బొట్టుపెట్టుము" ఈ సారి కూడా తులసీదాసు మోసపోతాడేమోనని ఆంజనేయస్వామి చిలక రూపం ధరించి యీ క్రింది పద్యమును చెప్పెనట.

చిత్రకూటకే ఘాట్ పర్<br>
భ ఈ, సంతనికీ భీర్!<br>
తులసీ చందన ఘిసే<br>
తిలకదేత రఘువీర్॥

తులసీదాసు రామచంద్రమూర్తి యొక్క అధ్భుత రూపాన్ని చూచి మైమరచిపోయాడట. రామచంద్రమూర్తి మంచి గంధమును తన ముఖాన పెట్టుకొని తులసీదాసు ముఖాన కూడా పెట్టి అంతర్ధానమైపోయాడట.

కౌసల్య తన కుమారుడు రాముని పాదాలకు నమస్కరించిందట.

పార్వతీదేవి ఒక వేయి సంవత్సరాలపాటు పండ్లు దుంపలు, తినీ, ఒక వంద సంవత్సరాలపాటు ఆకులు తినీ, కొన్ని సంవత్సరాలపాటు గాలిని పీల్చుకొని, నీటిని త్రాగీ పదివేల సంవత్సరాల పాటు కేవలం ఎండిపోయిన మారేడాకులు తిని తపస్సు చేసిందట.

అహల్య తన పెనిమిటి గౌతమ మహాముని శాపం వల్ల రాయి అయిపోయిందట. కాని రాముని పాదముల దుమ్ము తగలగానే ఆమె మరల మానవ శరీరాన్ని ధరించిందట.

బ్రాహ్మణులను, ఆవులను దేవతలను రక్షించటానికే భగవంతుడు ఆకారం లేనివాడైనప్పటికీ మనుష్య రూపం ధరించి రాముడుగా అవతరించాడట.

వేదాలు పురుషులట. వాటికి దుఃఖం కలుగుతుందట. అవి అలసి పోతాయట. వాటిని పొగిడితే సంతోషిస్తాయట.

సుగ్రీవుడు కోట్లకొలది కోతులను సీతను వెతకటానికై నలుమూలలకూ పంపించాడట.

రావణుడు రాముని మీద అనేక కోట్ల బాణాలు వేశాడట.

లంకలో రావణుని కోటను రక్షించటానికి కోట్లకొలది సైనికులు నియమింప బడ్డారట.

మనువు తన కుమారుడైన శతరూపునికై 23 వేల యేండ్లపాటు తపస్సు చేశాడట.

యుద్ధంలో గాయపడిన లక్ష్మణుని కోట్లాది సైనికులు పట్టి ఎత్తవలసి వచ్చిందట.

శివధనుస్సు10 వేల మంది రాజకుమారులు కలిసి కొద్దిగా ఎత్తగలిగారట.

రాముడు సముద్రం మీద వంతెనను కట్టించడానికి ఒడ్డున నిలబడినపుడు సముద్రంలో నుండి రకరకాల ప్రాణులు వేలాది సంఖ్యలో రాముని దర్శనానికై బయటకు వచ్చాయట.

రామలక్ష్మణులు పుట్టినపుడు సంతోషంతో అయోధ్యావాసులందరూ తమ యావదాస్తీనీ యితరులకు దానం చేశారట.

ఒక లక్ష బ్రాహ్మణ కుటుంబాలకు ఒక యేడాది కాలం పాటు ఒక్క బ్రాహ్మణ వంటమనిషే వంటచేసి వడ్డించాడట.

మారీచుడు విశ్వామిత్రుని యజ్ఞాన్ని చెడగొట్టడానికి వచ్చినపుడు రాముడు వానిని ఒకే ఒక బాణంతో సముద్రానికి ఆవల 860 మైళ్ళ దూరం వరకు విసిరివేశాడట.

లోమశ రుషి శాపంవల్ల ఒక బ్రాహ్మణుడు కాకి రూపం ధరించి "కాకాభుశుండి" అనే పేరుతో, బాలకుడైన రాముని వద్దకు వచ్చినపుడు రాముడు

దానిని పట్టుకోపోగా అది రాముని పొట్టలో దూరి అక్కడే అనేక యేండ్లపాటు ఉండినదట.

తులసీదాసు 1618లో అలహాబాద్ వెళ్ళాడట. అక్కడ మాఘ ఉత్సవం జరుగుతోందట. ఒక మఱ్ఱిచెట్టు క్రింద తులసీదాసుకు భరద్వాజ మహాముని, యజ్ఞవల్క్య మహర్షి కన్పించారట

భూగోళాన్ని తాబేలు, ఆదిశేషుడు మోస్తున్నాయట. భూమి తిరుగుటలేదట. ఇది స్థిరంగానే కదలకుండా ఉంటున్నదట.

వర్ణ వ్యవస్థ (కులాలు) ప్రపంచలోని అన్ని దేశాలలోనూ ఉందట.

కపట మహాముని సత్యకేతు పుత్రుడైన ప్రతాపభానుని ద్వారా ఒక ఏడాదిపాటు మూడు కోట్ల బ్రాహ్మణ కుటుంబాల వారికి భోజనం పెట్టించే యేర్పాటు చేయించాడట. అయినప్పటికీ ఇంకా అనేక కుటుంబాల వారు మిగిలిపోయారట.

రాముడు తన తల్లి కౌసల్యాదేవికి తన నాలుగు భుజాలుగల ఈశ్వర రూపాన్ని చూపించాడట. ఆ రూపాన్ని చూచి కౌసల్యాదేవి భయపడిపోయి కళ్ళు మూసుకొని రాముని పాదాలకు నమస్కరించిందట, రాముడు తన తల్లి గాబరాపడుట చూచి తన శిశురూపాన్ని మరల ధరించాడట.

విషము (గరళము) చంద్రునికి ప్రియమైన సోదరుడట. అందువల్ల చంద్రుడు విషాన్నే తన హృదయంలో కలిగివుండి, విషపూరితమైన కిరణాల ద్వారా (వెన్నెలద్వారా) ఎడబాటు వల్ల బాధపడే ఆడవాళ్ళను మగవాళ్ళను కాల్చి వేస్తున్నాడు, అని రాముడు సీత ఎడబాటు దుఃఖంలో అన్నాడట.

రాముని పరిపాలన కాలంలో ఆయన రాజ్యంలో నేరం చేసేవాడే వుండేవాడు కాదట, ఇక శిక్ష (దండన అనే మాట వుండేది కాదట)

జబ్బు వచ్చినపుడు రాముణ్ణి గాని ఆంజనేయస్వామిన గాని ప్రార్థిస్తే మందులు లేకుండానే జబ్బులు నయమైపోతాయట. ఎందుకనగా రాముని ఆంజనేయుని భక్తి "సంజీవని"గా పనిచేయునట.

రామరాజ్యంలో రామభక్తి పూజల ప్రభావం వల్ల ప్రజలందరి జబ్బులూ మందులు లేకుండానే నయమైపోతూ వుండేవట.

రాముని నామం స్మరిస్తూనే కూర్చుంటే శరీరకష్టం చేయకుండానే పనులన్నీ వాటంతటవే నెరవేరగలవట.

శివుడు 87 వేల యేండ్లపాటు సమాధిలో వున్నాడట. రావణుని ఒక దెబ్బతో రాముడు మూర్ఛపోయాడట. రావణుడు నడచునపుడు భూమి కంపించేదట. శివుని ధనస్సును రావణుడు చింతాకు ఎత్తయినా ఎత్తలేక పోయాడట. కాని రాముడు శివుని ధనుస్సును తన ఎడమ చేతి చిటికెన వ్రేలితో లేపి విరగగొట్టాడట.

రావణుడు చంపబడినపుడు అతని తేజస్సు రాముని నోటిలో ఇమిడి పోయిందట. ఈ విషయము చూచి శివుడు బ్రహ్మ సంతోషించారట.

జనకుడు వరకట్నం క్రింద రాముడు వగైరాలకు 1లక్ష గుఱ్ఱాలను, 25వేల రథాలను, 10వేల ఏనుగులను, వేలాది ఆవులను, గేదెలను, అనేక బండ్ల నిండా బంగారము, పట్టు గుడ్డలు, నూలు గుడ్డలు యితర సామానులు ఇచ్చాడట.

పార్వతీదేవి తల్లిదండ్రులు అల్లుడైన శివుని పాదాల మీదపడి అదేపనిగా నమస్కరించారట.

పార్వతీదేవి పాదాలకు కూడా ఆమె తల్లిదండ్రులు అదేపనిగా నమస్కరించారట.

సామాన్య ప్రజానీకాన్ని (కార్మిక కర్షక వర్గాలను) పొగడితే సరస్వతీదేవికి తలనొప్పి వస్తుందట.

శివుడు భవానీని సీతరూపం ధరించి రాముణ్ణి పరీక్షించమని ఆజ్ఞాపించాడట.

సీతను నిందించిన చాకలివాని పాపాలన్నింటినీ నశింపచేసి రాముడు వానికి వైకుంఠంలో నివాసం ఏర్పాటు చేయించాడట.

సీత రూపం ధరించి రాముణ్ణి పరీక్షించి ఆయనను అవమానపరచిందని యెంచి శివుడు భవానీని విడిచిపెట్టినందువలన ఆమె 87 వేల యేండ్లపాటు చెప్పనలవికాని కష్టాలు అనుభవించిందట.

శివుడు పార్వతిని పెండ్లిచేసుకోకుండా దూర దూరంగా వుండుటను చూచి శ్రీరామచంద్రమూర్తి శివునితో ఇలా అన్నాడట. "ఓ శివా ! నామీద నీకు నిజంగా

ప్రేమ గనుక వుంటే, నీవు నా విన్నపమును విని పార్వతిని పెండ్లి చేసుకో”

సీత అందాన్ని వర్ణించటానికి మామూలి, ఉపమ, ఉత్ప్రేక్ష మొదలైన అలంకారాలు పనికిరాలేదట. ఎందుకనగా అవి మామూలు ఆడవాళ్ళ అందాన్ని వర్ణించడానికి ఉపయోగింపబడ్డాయట. వాటితో సీతయొక్క అలౌకిక సౌందర్యాన్ని వర్ణిస్తే తాను “కుకవి” అనే అపకీర్తికి గురి కావలసి వస్తుందని తులసీదాసు వాటిని వాడలేదట.

అహల్యను మోసగించిన ఇంద్రుడు చంద్రుడు, ఇద్దరూ దేవతలుగా పూజింపదగిన వారట. కాని మోసపోయిన అహల్య మాత్రం మహాపాపియట, అందువల్లనే ఆమె పాషాణమైపోయిందట.

జనకుడు రాముడు వగైరాలకు యిచ్చిన వరకట్నం ముందు ఇంద్రుని కుబేరుల సంపదలు కూడా ఎందుకూ పనికి రావట.

తులసీదాసు స్మరించగానే సరస్వతీదేవి బ్రహ్మలోకం నుండి పరుగెత్తుకొని వచ్చి ఆయన ముందు ప్రత్యక్షమై “రామచరితమానస” సరోవరంలో స్నానం చేసి తన ప్రయాణ బడలికను తీర్చుకొనేదట.

భరతునికి ఆతిథ్య మివ్వటానికై భరద్వాజ మహాముని అష్టసిద్ధులను ఆహ్వానించి భరతునికి అతని సిబ్బందికి చక్కని ఆతిథ్యమివ్వమని ఆజ్ఞాపించాడట. వెంటనే అష్ట సిద్ధులు పూల దండలను, మంచి గంధమును, రకరకాల తినుబండారము లను, శయనించడానికి మంచి మంచి మంచాలను, అందమైన ఆడవాళ్ళను, ఎద్దు మాంసమును, మద్యమును భరతునికి ఆయన సిబ్బందికి సమకూర్చాయట.

రాముడు తాటకిను దీనురాలినిగా ఎంచి, దయతలచి ఆమెకు సద్గతిని (మోక్షాన్ని) యిచ్చాడట.

మారీచునికి రామునియందు ఎనలేని ప్రేమ ఉండేదట. కాని రావణుని ఒత్తిడివల్ల బంగారు లేడై రాముణ్ణి మోసగించవలసి వచ్చిందట.

నారద మహాముని రామునితో యిలా అంటాడు.

హే భగవాన్ ! తమకు ఎన్నో పేర్లు గలవు కాని రామనామం మాత్రం

అన్నిటికంటే గొప్ప మహిమ గలది. రామనామం చంద్రునితో సమానం. తక్కిన పేర్లు నక్షత్రాలతో సమానము. రామనామం భక్తుల హృదయాకాశంలో విరాజిల్లు చుండును.

"రామచరితమానస" గ్రంథం అయిదవ వేదమట.

వేదాలలో అయోధ్య వర్ణన, తీర్థరాజ ప్రయోగ ప్రశంస, కాశీ మహాత్యము, రాముని చరిత్ర మొదలగు వాటి వర్ణనలు గలవట.

ఆంజనేయులు తోక గల కోతియని కొన్ని చోట్ల వర్ణించి మరికొన్ని చోట్ల అతడు వేదాలు వ్యాకరణము మొదలైన శాస్త్రాలు చదివిన గొప్ప పండితుడని వర్ణింపబడెను.

ఆకాశం నుండి దేవతలు రాముడు వగైరాల మీద 60 సార్లు పుష్పవర్షం కురిపించారట.

10 వేల మంది యువరాజులు కలిసి శివధనుస్సును ఎత్తటానికి యత్నించారట, కాని అది మాత్రం కదలలేదట.

రాముడు అడవిలో వున్నపుడు సీతకు కోటి ఉపదేశాలు చేశాడట.

పార్వతీ దేవి 41 వందల యేండ్ల కంటే ఎక్కువ కాలం తపస్సు చేసిందట.

దశరథుని వెంట్రుకలు 100 యేండ్ల వయస్సు వరకూ తెల్లబడలేదట.

దశరథుడు చనిపోయినపుడు ఆయన శవాన్ని భరతుడు మేనమామ యింటి నుండి వచ్చేవరకు ఒక పడవలో నూనెపోసి దానిలో వుంచారట.

కుంభకర్ణుడు తిన్న ఎలుగుబంట్లు, కోతులు, వాని నోటినుండీ ముక్కునుండీ చెవులనుండీ బయటకు వచ్చి పారిపోయాయట.

రావణుడు అమృతకుండను తన నాభియందుంచుకున్నప్పటికీ అమృతము వానిని చావకుండా రక్షించలేక పోయిందట.

రాముడుకూడా భరతుని గొప్పతనాన్ని వర్ణించలేక పోయాడట.

లోతైన నదిని దాటటానికి రథానికి కట్టిన గుఱ్ఱాలు నీటిలో మునిగిపోనంత వేగంగా పరుగెత్తాయట.

పరశురాముడు తన వైష్ణవ ధనుస్సును రామునికి యివ్వబోగా అది

తనంతట తానే ముందుగా రాముని వద్దకు పరిగెత్తిందట.

పట్టాభిషేక ప్రయత్న సందర్భంలో రాముడు వసిష్టునితో యిలా అన్నాడట. "స్వామీ ! అన్నతమ్ములము మేమందరము ఒకేసారి పుట్టాము. తిండి, పాటలు, ఆటలు, చదువుల, చెవులను కుట్టించుకొనుట, జందెములు వేసుకొనుట, పెండ్లిండ్లు వగైరాలు అందరకూ ఒకే సారి జరిగాయి. కాని ఈ పవిత్రమైన సూర్యవంశంలో పెద్దకొడుకుకే రాజ్యాన్ని కట్టబెట్టుట అనుచితమైన కార్యంగా కన్పిస్తోంది. "

మనస్సు బుద్ధి వాణి మొదలగు వాటి ద్వారా రాముణ్ణి విమర్శించుట మహాపాపమని శంకరుడు భవానీకి చెప్పాడట.

*మానవజాతిలో సగభాగమైన ఆడవాళ్ళను తులసీదాసు ఎంత నీచంగానూ హీనంగాను వర్ణించాడో గుండె నిబ్బరం చేసుకొని చదవాలి.*

ఆడుది దుస్సాహసానికి, అబద్ధాలకు, చపలత్వానికి, పిరికితనానికి, మూర్ఖత్వానికి, అశుభ్రతకు, నిర్దాక్షిణ్యానికి పెట్టింది పేరు.

పెనిమిటి ఎటువంటి వాడై నప్పటికీ అతనిని పూజించి గౌరవించి సుఖపెట్టుటే ఇల్లాలు యొక్క ముఖ్య కర్తవ్యము,

ఆడుదానికి కామోద్రేకం మగవానికంటే ఎన్నోరెట్లు ఎక్కువ. అందుకని ఆడుది తన సొంత సోదరుని, తండ్రిని. కొడుకును, చూడగానే సూర్యుని చూడగానే సూర్యకాంతమణి ఏవిధంగా కరిగిపోతుందో, అదే విధంగా కామాంధురాలై చలించి పోతుంది. (బ్రహ్మదేవుడు కూతుర్ని కామించాడుగా)

శివుడు యిలా అంటాడు. ''ఓ పార్వతీ ! ఆడుది ఎల్లప్పుడూ అనుమానాలతోనే వుంది. ఆమె ఎవర్నీ నమ్మదు. కాని ఆమె కనీసం తన పెనిమిటినైనా సందేహించక ప్రశ్నించకూడదు.''

పార్వతి శివునితో ఇలా అంటుంది. "ఓ ప్రాణనాథా! శ్రీరామచంద్రమూర్తి గారి పవిత్రమైన జీవితచరిత్రను ఆడవాళ్ళమైన మేము వినటానికి అర్హులము కానిమాట నిజమే. కాని నేను మనస్సుతోనూ, వాక్కుతోనూ, కాయంతోనూ మీ పాదసేవ చేస్తున్న దాసిని. కనుక శ్రీరామచంద్రమూర్తిగారి పవిత్రమైన జీవిత చరిత్రను మీరు దయతో నాకు వినిపించి నన్ను ధన్యురాలినిగా చేయండి.

రామలక్ష్మణుల అత్తలు తమ కుమార్తెలను అత్తగారింటికి సాగనంపుతూ ఇలా వాపోయారు "అయ్యో! బ్రహ్మ దేవుడా! ఆడుదానిని ఎందుకు పుట్టించావయ్యా?"

సీత తల్లి రామునితో ఇలా అంటుంది. "అబ్బాయీ ! మా యీ సీత మా అందరకూ ప్రాణంకంటే కూడా ఎక్కువ ప్రియమైనది. నీవు ఈమె నడతను ప్రేమను

గమనించి ఈమెను నీ దాసిదానిగా చేసుకొనుము"

అహల్య రామునితో ఇలా అంటుంది. "ఓ ఆర్యా! నేను అపవిత్రురాలైన ఆడుదానిని. కనుక మీరు నన్ను క్షమించి రక్షించండి."

కైకెయిని గురించి విద్వాంసులు ఇలా అన్నారు. "ఆడవాళ్ళ కపటము అగమ్యమైనది. అగాధమైనది. మనము మన నీడనైనా పట్టుకోగలమేమోగాని ఆడవాళ్ళ నడతను కనిపెట్టుట దుర్లభము."

భరతుడు తల్లిని ఉద్దేశించి ఇలా అంటాడు. "ఆడుదాని హృదయగతిని బ్రహ్మదేవుడుకూడా తెలిసికోజాలడు. ఆడుదాని హృదయము సకలపాపాలకు, కపటాలకు, అవగుణాలకు పుట్టిల్లు"

అనసూయ సీతాదేవితో ఇలా అంటుంది. "ఓ సీతా! పెనిమిటి సేవ చేయని ఆడుదాని బ్రతుకు ఎందుకూ పనికిరాని బ్రతుకే. పెనిమిటి మనోవాక్కాయాలతో సేవచేయని ఆడుది యమలోకంలో అనేక యాతనలను అనుభవిస్తుంది. అందువలన పవిత్రమైన పెనిమిటి సేవ చేసినయెడల ఆడుదానికి ముక్తి లభిస్తుంది."

భిల్లు జాతి ఆడుదైన శబరి రామునితో ఇలా అంటుంది. "ఓ స్వామీ ! నేను అధమజాతిలో పుట్టాను అందులోనూ ఆడుదానినై పుట్టాను. ఆడుదానినగుట వలన నాకు బుద్ధిలేదు. నేను పరమ మూర్ఖురాలను. పరమనీచురాలను. కనుక నేను మిమ్ములను పొగడడానికి తగినదానిని కాదు."

రాముడు సీతను అడవిలో వెతుకుతూ లక్ష్మణునితో ఇలా అంటాడు "తమ్ముడూ లక్ష్మణా ! ఆడుదానిని ఎంత హృదయపూర్వకంగా ప్రేమించినా ఆమె శాస్త్రాలకు, రాజుకు వశము కాజాలదు. ఆడుదాని శరీరం దీపజ్వాల వంటిది. మగవాడు రెక్కల పురుగువంటివాడు, ఆడవాళ్ళకు జుట్టే అందము, వాళ్ళకు ఆకలి ఎక్కువ. వారిలో ఎక్కువమంది మూర్ఖులుగానూ, బుద్ధిలేనివారుగానూ వుంటారు. వారి హృదయాలు కఠోరమైనవి. వారిలో జాలి వుండదు. మగవాళ్ళు కామేచ్ఛకు (జతకట్టాలనే కోరికకు) మూలం ఆడవాళ్ళే. కనుక ఎవడైతే ఆడుదాని వ్యామోహం నుండి తప్పించుకోగలుగుతాడో, వాడే నిజమైన యోధుడు."

జనకుడు తన కుమార్తెను అత్తగారింటికి సాగనంపుతూ దశరథ మహారాజు

గారిని ఇలా వేడుకుంటాడు. "ఓ మహారాజా ! మా యీ బాలికలను మీరు మీ దాసీలుగా యెంచి వారిని దయతో పోషించండి. "

దశరథ మహారాజు కైకేయినుద్దేశించి ఇలా వాపోవును. "అయ్యో ! నేను ఆడుదాని మాటలు నమ్మి యోగభ్రష్టుడనై నాశనమైపోయాను.

అనసూయ సీతాదేవితో ఇలా అంటుంది. "ఓ సీతా ! ఆడుది తన పెనిమిటి ద్వారా తిట్లూ, దెబ్బలు తింటూ కూడా తన పెనిమిటికి ప్రతీకారం చేయకూడదు. పెనిమిటి మూర్ఖుడైనా, క్రూరుడైనా, త్రాగుబోతైనా, తెలివితక్కువవాడైనా, దరిద్రుడైనా, గ్రుడ్డివాడైనా, కుంటివాడైనా, మూగవాడైనా, చెవిటివాడైనా, ఎటువంటి వాడైనప్పటికీ అతనిని గౌరవించాలి. అతని మాట శిరసావహించి నడచుకోవాలి. ఏ ఆడుది పతివ్రతగా వుండదో అది నీచురాలుగా ఎంచబడుతుంది."

సముద్రం రాముడితో ఇలా అంటుంది. "ఓ స్వామీ ! మద్దెల, పల్లెటూరి అమాయకుడు, ఆడుది, శూద్రుడు, పశువు యీ అయిదుగురూ ఎడాపెడా (రెండువైపులా - పూర్తిగా) వాయించదగిన వారు (దండింపదగిన వారు)."

పెండ్లి చేసుకోవాలనుకుంటున్న నారద మహామునితో రాముడు ఇలా అంటాడు. "ఓ మునివర్యా ! ఆడుది మాయారూపిణి. ఆమె భయంకరమైన కష్టాలను కలిగిస్తుంది. జపతపాలను పాడుచేస్తుంది. ఆడుదానివల్లనే మగవానికి కామము, క్రోధము, మొదలగు దుర్గుణాలు కలుగుతాయి. ఆడుదే మగవానికి చెడ్డకోరికలను కలిగిస్తుంది. ఆడుది పాపాలకు, అజ్ఞానానికి మూలము, పెనిమిటియొక్క బుద్ధిని బలమును సత్యనిష్టను, ఆడుదే నాశనం చేస్తుంది. ఆడుది సర్వ అవగుణాలకూ పుట్టిల్లు. కనుకనే ఓ మహామునీ! నేను మిమ్ములను పెండ్లిచేసుకోకుండా అడ్డుపెట్టాను. అవగుణాలకు కేంద్రం గనుకనే మగవానికి (వరునికి) వరకట్నం యిచ్చి తల్లిదండ్రులు ఆడపిల్లల పీడను వదిలించుకోవటానికి యత్నిస్తారు."

పార్వతి తల్లి మైనా అల్లుడైన శివునితో ఇలా అంటుంది "ఓ స్వామీ ! ఈ నా పార్వతి నాకు ప్రాణంతో సమానం మీరు ఈమెను మీ యింటికి దాసిగా చేసుకొని ఈమె చేసే తప్పులను మన్నించండి."

మైనా తన కుమార్తె పార్వతీదేవితో ఇలా అంటుంది. "ఓ అమ్మాయి!

పార్వతి  నీవు ఎల్లప్పుడూ నీ పెనిమిటియైన శివుని పాదసేవ చేస్తూ ఉండుము. ఆడుదానికి పెనిమిటి తప్ప వేరే దైవము లేనేలేదు.”

“మగవాళ్ళు మాటలలో పడిపోయి ఆడవాళ్ళు చపల చిత్తురాండ్రై పోతారు. ఆడవాళ్ళ బుద్ధి వారి పెదాలలో వుంటుంది.”

సముద్రంలో ఏదైనా ఇమిడిపోతుంది. అగ్ని దేనినైనా కాల్చివేయగలదు. చావు ఎవరినీ విడిచిపెట్టదు. అలాగే ఆడుది ఏదైనా చేయగలదు.

“నీడ శరీరాన్ని, ఎండ సూర్యుణ్ణి, వెన్నెల చంద్రుణ్ణి ఏవిధంగానైతే విడిచి వుండజాలవో అదే విధంగా పెనిమిటిని విడచి ఆడుది వుండజాలదు.”

మను మహారాజు ఇలా సెలవిచ్చాడు. “ఆడుదానికి ఏమాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను యివ్వకూడదు, కనుక కన్యగా (పెండ్లి కాకమునుపు) వున్నప్పుడు తండ్రి అదుపులోనూ, యువతిగా వున్నప్పుడు పెనిమిటి అదుపులోనూ, ముసలిదైనప్పుడు పుత్రుల అదుపుతోనూ ఆడుది వుండవలసిందే గాని దానికి ఏ మాత్రం స్వేచ్ఛ వుండకూడదు.

ఆడుది జ్ఞానం సంపాదించుకోవటానికి ఏవిధంగానూ అర్హురాలు కాదు.

ఆడవాళ్ళను జడ (ప్రాణం లేని) పదార్థాలుగానూ, నీచంగానూ చూస్తూ వారిని ఇండ్లలో బందీలనుగా వుంచాలి.

ఆడుదానిని నమ్మటమంటే అజ్ఞానానికి, అవిద్యకు వశమైపోవటమే.

పెనిమిటి యొక్క పవిత్ర పాదాల వద్దపడి వుండటమే ఆడుదాని జీవితం యొక్క ఏకైక లక్ష్యము

ఎన్నో అవగుణాలకు పుట్టిల్లయిన ఆడుదానిని మగవాడు ఎల్లప్పుడూ కొట్టుతూనే వుండాలి.”

భరతుడు తల్లితో ఇలా అంటాడు “ఓసీ దుష్టురాలా! నీ నాలుక తెగిపోవుగాక! నీ నోట్లో పురుగులు పడు గాక! నీవు పాపాలకు కపటానికి చెడ్డగుణాలకు గనివి. నేవెందుకు పుట్టావే? పుట్టినా గొడ్రాలివిగా ఎందుకు పుట్టలేదే?

ఆడుదాని నడతసముద్రంలా అగాథమైంది.

ఏ ఆడుదైనా పెనిమిటికి ఎదురుతిరిగి వానికి విరుద్ధంగా నడుస్తుందో అది రెండవజన్మ ఎక్కడైనా పుట్టవలసి వస్తే అది పడుచుతనంలోనే విధవై పోతుంది.

ఆడుది సహజంగా (స్వభావంతో) అపవిత్రురాలు. కాని కపటంలేకుండా పెనిమిటికి సేవలు చేసి అతనిని సుఖపెడితే ఆమె సద్గతి పొందగలదు.

రాముడు లక్ష్మణునితో ఇలా అంటాడు. “ ఓ తమ్ముడా! లక్ష్మణా ! ఏ పురుషుడైతే కామాన్ని ధైర్యంగా ఎదుర్కోగలడో, వాడు మాన్యుడు. ఎందుకనగా ఈ కామ దేవునికి మిక్కిలి బలమైన స్నేహితురాలు ఆడుది. కనుక ఏ పురుషుడైతే ఆడుదాని వ్యామోహం నుండి బయట పడగలడో వాడే నిజమైన యోధుడు.”

ఆడుది సకల కష్టాలు కలిగించే మాయా రూపిణి.

రాముడు నారద మహామునితో ఇలా అంటాడు. “ ఓ మునీశ్వరా! వేదాలు పురాణాలు సజ్జనులు ఆడుదాన్ని గురించి చెప్పిన కొన్ని మాటలను వినండి. మోహమనే వనంలో ఆడుది వసంత రుతువు వంటిది. ఆడుది జపము, తపము, నియమములనే జలాశయాలను, గ్రీష్మ రుతువులను ఎండింపజేస్తుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యమనే కప్పలకు ఆడుది వర్షాకాలమువలె ఆనందాన్ని కలిగిస్తుంది. దుష్టవాసనలనే కలువల సమూహానికి ఆడుది శరత్‌రుతువవలె సుఖం కలిగిస్తుంది. సమస్త ధర్మములనే కమలముల సమూహాన్ని ఆడుది హేమంత రుతువు మంచువలె నశింపజేస్తుంది. మమత అనే బ్రహ్మాదొండ మొక్కను ఆడుది శిశిరరుతువువలె ఏపుగా పెంచుతుంది. ఘోరమైన చీకటి రాత్రివలె పాపాలనే గుడ్లగూబ గుంపులకు ఆడుది ఆనందాన్ని కలిగిస్తుంది. బుద్ధి, బలము, శీలము, సత్యము, అనే చేపలను ఆడుది గాలమువలె నశింప చేస్తుంది. ఇవే మాటనలు వివేకవంతులు కూడా వక్కాణించారు.

పెద్దవాన కురిసినపుడు చేలగట్లను తెంచుకొని నీరు ఏ విధంగానైతే నలువైపులా స్వేచ్ఛగా తన యిష్టమొచ్చినట్లు పారుతుందో. అదే విధంగా స్వేచ్ఛ లభించిన ఆడుది. తన ఇష్టమొచ్చినట్లు విర్రవీగి చెడిపోతుంది.

రావణుడు తన ఇల్లాలు మండోదరితో ఇలా అంటాడు. “ఓ సుగుణవతీ ! ఆడవాళ్ళలో ఎన్ని చెడ్డ గుణాలున్నాయని కవులు చెప్పారో అవన్నీ అక్షరాలా నిజము.

సంఘానికి భయపడి ఏ ఆడుదైతే పతివ్రతగా నటిస్తుందో అది అధమరాలుగా (పాపిగా) ఎంచబడుతుంది.

ఇక బ్రాహ్మణుల గొప్పదనాన్ని గురించి తులసీబాబా వక్కాణించిన గప్పాలను గమనిద్దాం

తపస్సు ప్రభావం వల్ల బ్రాహ్మణుడు గొప్ప శక్తిగల వాడు కాగలుగుచున్నాడు. అతని కోపము నుండీ శాపం నుండి ఎవ్వర్నీ ఎవ్వడూ రక్షించలేడు.

బ్రాహ్మణుని మంచి చేసుకొన్న వానికి బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, దేవతలు మొదలగువారు వశులైపోతారు.

బ్రహ్మ యొక్క కోపము నుండీ శాపమునుండీ ఎవరినైనా బ్రాహ్మణుడు రక్షించగలడు. కాని బ్రాహ్మణునితో విరోధము పెట్టుకొన్నవానిని రక్షించేవాడు మూడు లోకాల్లోనూ లేనేలేడు

బ్రాహ్మణుని శాపం వల్లనే పవిత్రమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన రావణుడు రాక్షసుడుగా మారి పోయాడు.

కోదండరాముని తమ్ముడైన లక్ష్మణుడు గొడ్డలి రామునితో (పరశురామునితో) ఇలా అంటాడు. "ఓ మహాత్మా ! మీరు భృగు వంశీయులు. మీరు పవిత్రమైన జందెమును ధరించిన బ్రాహ్మణోత్తములు. కనుక నేను మీ మీద కోపం చూపించలేను. బ్రాహ్మణులు, ఆవులు, భగవద్భక్తులు, మొదలగు వారి మీద కోపం చూపించకూడదని శాస్త్రాలు చెప్పుచున్నాయి. కనుక మీరు నన్ను కొట్టినా తిట్టినా, తన్నినా, చంపినా, నేను మీ కాళ్ళమీద పడదగినవాడనే.

రాయయ్యతండ్రి ఇలా సెలవిస్తాడు. "బ్రాహ్మణుని ఎవడైతే ద్వేషిస్తాడో వానిని నేను ప్రేమించను. కాని ఎవడైతే కపము వీడి మనస్సుతోనూ, వాక్కుతోనూ శరీరంతోనూ బ్రాహ్మణులకు సేవచేయునో వారికి నేనే కాదు బ్రహ్మ, మహేశ్వరుడూ, దేవతలంతా కూడా వశులైపోతారు.

"బ్రాహ్మణుడు గుణము నడక జ్ఞానము లేనివాడు గానూ క్రూరుడుగానూ

మూర్ఖుడుగానూ వున్నప్పటికీ వాడు బ్రాహ్మణకులంలో పుట్టాడు గనుక వాడు పూజింపదగినవాడే. కాని శూద్రుడు గుణము, నడత, జ్ఞానము కలిగివుండి పరోపకారిగానూ దయాదాక్షిణ్యాలు గలవాడుగానూ వున్నప్పటికీ వాడు శూద్ర కులంలో పుట్టాడు గనుక వాడు పూజింపదగినవాడు కాడు" అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

బ్రాహ్మణుని శాపము (తిట్లు) చాల భయంకరమైనవి. ఎట్లనగా విష్ణుమూర్తి తన ద్వారపాలకులైన జయవిజయులను చంపినప్పటికీ వారికి ముక్తి కలుగలేదు. ఎందుకనగా వారికి మూడు జన్మలవరకూ ముక్తికలగటానికి వీల్లేదని బ్రాహ్మణుడు శపించెను.

చాకలి దానికి పుట్టి బ్రాహ్మణత్వాన్ని పొందిన నారద మహాముని ఒకసారి భగవంతుణ్ణి శపించెను. అందువల్ల భగవంతుడు మరో జన్మఎత్తవలసి వచ్చింది.

ఎవడైతే బ్రాహ్మణుని సంతృప్తి పరుస్తాడో వానికి దేవతలంతా వశులై పోతారు.

బ్రాహ్మణుల మేలు కోరిన వారికి అంతా శుభమే కలుగును. బ్రాహ్మణునికి కీడుకోరినవారికి అంతా అశుభమే కలుగును.

రాముడు పుట్టినపుడు దశరథ మహారాజు బ్రాహ్మణులకు మాత్రమే మణులు, బంగారము, పట్టుగుడ్డలు, మొదలగునవి దానం చేశాడు.

రాముని హృదయంలో బ్రాహ్మణుల పాదాల గుర్తులు శోభిస్తూ వుండేవి.

రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట జనకపురమునకు వెళ్ళేటప్పుడు వారు గంగానదిలో స్నానం చేసి అనేకమంది బ్రాహ్మణులకు అనేకరకాల దానాలు చేశారు.

రాముడు పరశురామునితో ఇలా అన్నాడు. "ఓ స్వామీ ! మీరు మేము సమానం ఎలా కాగలము? మీరు మెదడుతో సమానము, మేము పాదాలతో సమానము."

రాముడు వనవాసానికి వెళ్ళబోయేముందు అయోధ్యలోని బ్రాహ్మణులందర్నీ పిలిచి వారికి కొన్ని యేండ్లవరకు సరిపోయే భోజన సామాగ్రీ వగైరాలను యిచ్చి వార్కి నమస్కరించి వారి ఆశీర్వాదాలు పొందాడు.

రాముడు వాల్మీకి మహామునితో ఇలా అంటాడు. " ఓ మహామనీ !! బ్రాహ్మణులను సంతృప్తి పరచుటవల్ల శుభము కలుగును. బ్రాహ్మణుని కోపము , కోట్లాది వంశాలను నాశనము చేయగలదరు.

సుమంతుడు రామలక్ష్మణ సీతలను అడవిలో విడిచి అయోధ్యకు వచ్చినపుడు అతడు బ్రాహ్మణుని చంపినంత పాపాత్ముడుగా ఎంచబడ్డాడు.

ఎవడైతే బ్రాహ్మణుని ద్వేషించునో, వాని వంశము చలిగాలికి దోమలు నశించిపోయినట్లే నశించిపోవును.

మేఘనాధుడు హనుమంతునిమీద బ్రహ్మాస్త్రమును ఉపయోగించాడు. అప్పుడు బ్రహ్మాస్త్రము యొక్క శక్తిని మన్నించనట్లయితే, బ్రాహ్మణుల గొప్పతనానికి భంగం వాటిల్లునని యెంచి హనుమంతుడు బ్రహ్మాస్త్రమునకు బుద్ధిపూర్వకంగా లొంగిపోయి పట్టుపడ్డాడు.

రాముడు విభీషణునితో ఇలా అంటాడు. "ఓ విభీషణా ! ఎవడైతే బ్రాహ్మణుల పాదాలను ప్రేమించునో వాడు నాకు నా ప్రాణములకంటే కూడా ఎక్కువ ప్రియమైనవాడు."

రాముడు విభీషణునితో ఇంకా ఇలా అంటాడు. "ఓ విభీషణా ! బ్రాహ్మణ గురువుల పూజ అభేద్యమైనది. కవచము వంటిది. విజయము సాధించటానికి ఇంతకంటే గొప్ప ఉపాయము మరొకటిలేదు.

వసిష్ఠుడు బ్రాహ్మణులతో ఇలా అంటాడు. "ఓ బ్రాహ్మణోత్తములారా! మీరంతా సంతోషంతో సింహాసనం మీద కూర్చోమని రాముణ్ణి ఆజ్ఞాపించండి."

బ్రాహ్మణకులంలో పుట్టినవాడు నడతలేని నీచుడైనప్పటికీ వానికి ఎవడైతే నిందిస్తాడో వాడు రౌరవాది నరకాలను అనుభవించి చివరకు కాకిగా పుడతాడు.

బ్రాహ్మణకులంలో పుట్టిన ప్రతి వాడు, ఈ భూలోకంలో గొప్పవాడుగానే ఎంచబడాలి.

ప్రపంచంలోని సకల సంపదలు బ్రాహ్మణుల సొంతసొత్తే.

బ్రాహ్మణకులంలో పుట్టినవాడే దేవతలకు దేవత కాగలడు.

బ్రాహ్మణుడు ఎవనినైనా తిట్టినా, కొట్టినా చంపినా, అతడు పూజనీయడే

మను మహారాజు ఇలా సెలవిచ్చారు. "ఏ శూద్రుడైతే బ్రాహ్మణుని తిట్టునో రాజు వాని నాలుక కోసి వేయించాలి. ఎందుకనగా వాడు నీచ కులంలో పుట్టాడు గనుక."

ఏ శూద్రుడైతే బ్రాహ్మణుని తిట్టునో వాని నోటలో 10 అంగుళాల పొడవైన ఇనుప కడ్డీని ఎర్రగా కాల్చి పెట్టించాలి.

ఏ శూద్రుడైతే విద్యాగర్వంతో బ్రాహ్మణులకు ధర్మబోధ చేయ యత్నిస్తాడో వాని నోటిలోనూ, చెవుల లోనూ వేడి వేడి నూనెను పోయించాలి.

బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ సకల సేవలూ చేయుటు శుద్రుల పరమ కర్తవ్యము.

తమకు సేవచేసే శూద్రులకు బ్రాహ్మణులు తాము తినగా మిగిలిన ఎంగిలి మెతుకులను. తమ చినిగిన గుడ్డలను తమ పగిలిన పాత్రలను యివ్వాలి

వడ్రంగి, మంగలి, గొల్ల, కుమ్మరి, కోమటి, కిరాతకుడు, కాయస్థుడు. పాకీవాడు, చండాలుడు మొదలగువారు అంత్యజులు (శూద్రులు). వీరితో మాట్లాడినా వీరిని చూచినా వీరిని తాకినా సూర్యుని దర్శించి శుద్ధి పొందాలి.

రాముడు ఇలా ధర్మోపదేశం చేస్తాడు. "నేను భక్తి సాధనను గురించి చాలా విపులంగా చెబుతాను. అది అతిసులభ మార్గము. ఆ మార్గాన్ని అనుసరిస్తే భక్తులు నన్ను అతి తేలికగా పొందుతారు. అదేమిటనగా భక్తులు ముందుగా బ్రాహ్మణుల పాదాలను ప్రేమించాలి. వారు వేదాల ననుసరించి తమ తమ వర్ణాశ్రమ కర్మలను చేస్తూ ఉండాలి.

బ్రాహ్మణులు అజ్ఞానం వలన కలిగే సందేహాలను నిర్మూలింపచేస్తారు. కనకు వార్కి అందరూ నమస్కరించాలి.

ఈ రోజులలో శూద్రులనబడే వారిలో కొందరు బ్రాహ్మణోత్తములతో వాదోపవాదాలు ఇలా చేస్తున్నారు. "మేము మీ కంటే ఏమి తక్కువ? ఎవడైతే బ్రహ్మను తెలిసికొంటాడో వాడే నిజమైన బ్రాహ్మణుడు" అని బ్రాహ్మణులను బెదరించి కళ్ళెర్రజేసి చూస్తున్నారు.

రామభక్తులుకాని వారికీ బ్రాహ్మణుల గొప్పతనాన్ని ఒప్పుకోని వారికి

రామయణమును వినిపించకూడదు.

రామరాజ్యంలో అన్ని జాతుల వారు అడ, మగ అందరూ బ్రాహ్మణ పాదపూజ నిత్యమూ చేసేవారు. అందువలన వారంతా పరోపకారులగానూ ఉదారస్వభావం గలవారుగానూ ఉండేవారు.

ఎవడైతే శ్రాద్ధకర్మ, తర్పణాలు, తద్దినాలు, యజ్ఞాలు వగైరాలను చేసి బ్రాహ్మణులకు దానధర్మాలు చేస్తాడో వాడు యీ లోకంలోనూ స్వర్గలోనూ అమితమైన సుఖాలను అనుభవిస్తాడు.

జనకుడు పెండ్లి పెద్దలను ఆహ్వానించినపుడు కుల వ్యవస్థననుసరించే (వర్ణాశ్రమ ధర్మాలననుసరించే) ముందుగా బ్రాహ్మణోత్తములను సత్కరించాడు.

భిక్షాటన బ్రాహ్మణుల జన్మహక్కు. బ్రాహ్మణోత్తములకు దానధర్మాలు చేయుట తక్కిన కులాలవారి ముఖ్య కర్తవ్యం

మానవజాతి ప్రతినిధులైన బ్రాహ్మణోత్తముల ఆర్తనాదం విన్నప్పుడల్లా భగవంతుడు అవతరిస్తాడు.

బ్రాహ్మణుని శాపము భగవంతుని మోక్షదాయకమైన బాణము కంటే కూడా ఎక్కువ బలమైనది.

బ్రాహ్మణుని శాపమును సాక్షాత్ భగవంతుడు కూడా అనుభవించవలసి వచ్చింది.

బ్రాహ్మణులు యితర కులాల వారిచేత యజ్ఞాలు చేయిస్తే దేవతలంతా యజ్ఞం చేసినవారికి వశులై పోతారు.

బ్రాహ్మణులు సంతోషిస్తేనే దేవతలు కూడా సంతోషిస్తారు.

తులసీదాసు భగవంతుడైన రాముడు బ్రాహ్మణులకు గోవులకు మేలు చేయును

రాముడు పుట్టినపుడు జాతకము వ్రాసిన బ్రాహ్మణులకు బంగారము, ఆవులను పట్టుగుడ్డలను తినుబండారాలను దశరథమహారాజు దానం చేశాడు.

రాముని పెండ్లి జరిగిన తరువాత విశ్వామిత్రుడు జనకమహారాజుతో ఇలా అంటాడు. "ఓ రాజా! పెండ్లి జరిగింది. ఇక నీవు కులవ్యవస్థననుసరించి పెద్దలకు

మర్యాదలుచేయుము. ముందుగా బ్రాహ్మణోత్తముల కులము లోని ముసలివాళ్ళను, గురువులను సంప్రదించి వేదానుకూల మర్యాదలను సలుపుము."

వశిష్ఠుడు దశరథునితో ఇలా అన్నాడు. "ఓ మహా రాజా ! నీవు రాణీ ఇద్దరూ ఎల్లప్పుడూ బ్రాహ్మణులను గురువులను గోవులను దేవతలను పూజించుచున్నారు."

రామలక్ష్మణులు వనవాసమునుండి తిరిగి అయోధ్యకు వచ్చినపుడు రాణులు, సంతోషముతో బ్రాహ్మణులకు ఎన్నోదానాలు చేశారు. బ్రాహ్మణోత్తములు రామలక్ష్మణులను ఆశీర్వదించారు.

జనకుడు కామధేనువులవంటి అందమైన మంచి స్వభావముగల 4లక్షల ఆవులను బంగారు నగలతో బాగా అలంకరించి బ్రాహ్మణోత్తములకు దానమిచ్చాడు.

రామచంద్రమూర్తి నిత్యమూ నిద్రపోయే ముందు బ్రాహ్మణుల పాదాలను స్మరించుకుంటూ నిద్రించుట ఆయనకు అనివార్యమైన నియమము

దశరథుని శ్రాద్ధకర్మ సందర్భంలో భరతుడు బ్రాహ్మణోత్తములకు సింహాసనములు, నగలు, పట్టువస్త్రాలు, ధాన్యాదులు, భూమి, ధనము, ఇండ్లు మొదలగువాటిని దానం చేశాడు.

భరతుడు రాముని పాముకోళ్ళ సహితంగా అయోధ్యకు తిరిగివచ్చి బ్రాహ్మణోత్తములతో ఇలా అన్నాడు. "ఓ బ్రాహ్మణోత్తములారా! మీ ఆజ్ఞప్రకారం నేను నడచుకోగలను మీరు నన్ను సక్రమంగా నడిపించండి.

రామలక్ష్మణులు బ్రాహ్మణ ఆడవాళ్ళ పాదాలకు కూడా నమస్కరించారు.

దుర్వాస మహాముని శాపంవల్ల రాక్షస రూపం ధరించిన ఒక గంధర్వుని రాముడిలా అంటాడు. "ఓ గంధర్వ ! నాకు బ్రాహ్మణుని ద్వేషించినవాడు నచ్చడు. నేను వానిని పూర్తిగా ద్వేషిస్తాను.

ఇంద్రుడు రామునికి సహాయానికై లంకలోని యుద్ధానికి తన రథాన్ని, రథ సారధిని పంపాడు, రాముడు రథం ఎక్కటానిక ముందు బ్రాహ్మణుల పాదాలకు నమస్కరించాడు

ఎవరైతే బ్రాహ్మణులను గౌరవించి పూజించరో వారు దుష్టులుగా

ఎంచబడతారు వారిలో కపటము డంబము నిండి వుండును

ఆవుకు, గాడెదకు ఎంత తేడా వుందో, బ్రాహ్మణుడికి శూద్రునికి అంతే తేడా ఉంది.

మను మహర్షిగారు అంటారు. "సోదరా నేను చెప్పే పరమ సత్యాన్ని శ్రద్ధగా వినుము, బ్రాహ్మణుల పాదసేవయే భగవంతుణ్ణి సంతోషపెట్టే పవిత్రమైన వ్రతము.

మహత్తరమైన. అద్భుతమైన సంఘటనలు బ్రాహ్మణులైన రుషుల మునుల శాపాలవల్ల గాని వరాలవల్లగాని జరుగుతాయి.

## నా తుది పలుకులు

తులసీ రామాయణాన్ని నిష్పక్షపాతబుద్ధితోనూ, మానవతాదృష్టితోనూ, వివేకంతోనూ చదివిన విజ్ఞతగల సమతావాదియైన చదువరునికి తులసీదాసు పక్కా బ్రాహ్మణ పక్షపాతిగానూ, కరుడుగట్టిన పూర్వాచార పరాయణుడుగానూ, పక్కా మత చాదస్తుడుగానూ, ఆడవాళ్ళను శూద్రులను ద్వేషించినవాడుగానూ చపలచిత్తుడు గానూ, అమిత కామిగానూ, కపోల కల్పనాచార్యుడుగానూ, వర్ణ వ్యవస్థ ప్రోత్సాహ కుడుగానూ కన్పిస్తాడు. ఇంతేకాదు, తులసీబాబా మూఢనమ్మకాలను, మూఢాచారాలను, వెట్టిచాకిరీని, మతమౌఢ్యాన్ని సమర్థించాడు.

తులసీదాసు ఆడవాళ్ళల్లోనూ, శూద్రులలోనూ ఆత్మ విశ్వాసము, ఆత్మ గౌరవము, స్వావలంబనము, స్వతంత్ర ఆలోచనలు మొదలగు మంచిగుణాలను లేకుండాచేసి, వారిలో ఆత్మహీనత్వాన్ని ప్రచారం చేసి, "మాకు బుద్ధిలేదు! మేము మూఢులము, మేము పాపులము, మేము నీచులము, మమ్ములను ఉద్ధరించేవారు భూలోక దేవతలైన బ్రాహ్మణులే' అనుకొనేంత నీచమైన బానిస భావాలను కల్గించాడు.

తలసీదాసు బ్రాహ్మణులు, రాజులు ఇద్దరూ దైవంతో సమానంగా పూజ్యు లనియు, వారిని దూషించుటగానీ, ద్వేషించుటగానీ, ఎదురించుటగానీ మహా పాపమనియు, గొప్ప నేరమనియు, సామాన్య ప్రాజానీకానికి బోధించి, వారలను నపుంసకులుగా చేసి. వారెన్నటికీ రాజునుగాని, బ్రాహ్మణుని గాని ఎదురించలేనంత

శారీరక బలహీనులుగానూ, బౌద్ధికంగా మూర్ఖులుగానూ చేసి వేశాడు. తన బ్రాహ్మణ వర్ణానికి హిందూ సమాజంలో కొన్ని వందల యేండ్లవరకు శారీరక పరిశ్రమ లేని భుక్తికి లోటులేని ఆర్థిక వనరులకోసం తద్దినాలు, దినాలు, తర్పణాలు, యజ్ఞాలు, తీర్థస్థానాలు, నదీస్నానాలు, మొదలగు వాటిని కల్పించి బ్రాహ్మణులకు లెస్సగా దానధర్మాలు చేయుట గొప్ప పుణ్యకార్యమనియు, మోక్షదాయకమనియు, బూటకపు శాస్త్ర గ్రంథాలనుండి అనేక ప్రమాణాలను చూపించి నమ్మింప యత్నించాడు. ఇంతే కాదు తులసీదాసు తర్పణాలు, దినాలు, తద్దినాలు, మొదలగు వటిని పెట్టమని బ్రాహ్మణులకు దానధర్మాలు చేయని శూద్రులు రౌరవాది నరకాలకు పోతారని హెచ్చరించాడు.

తులసీదాసు సాంఘిక అసమానత్వాన్ని సమర్ధిరంచి శూద్రులలో కులతత్వాన్ని రెచ్చగొట్టి వారిలో ఐక్యత లేకుండా చేసి వారిలోవారికి కీచులాటలు ఎక్కువ తక్కువ తేడాలు కల్పించి వారంతా ఏకమై బ్రాహ్మణుల మీద దండెత్త కుండా వుండేలాగున కుటిల కుల వ్యవస్థను సుస్థిర పరచటానికి యత్నించాడు.

తులసీదాసు ఆడవాళ్ళకు చేసిన అన్యాయము. అవమానము ఏ దేశంలోనూ ఏ తత్వవేత్త గాని ఏ రాజకీయవేత్తగానీ ఏ భాషలోని ఏ కవిగాని లేఖకుడు గాని చేయలేదు.

మానవసమాజంలో సగభాగమైన ఆడవాళ్ళను తులసీదాసు పూర్తిగా జడపదార్థంగానూ (ప్రాణం లేని), మూర్ఖులుగానూ, నీచులుగానూ, కట్టుబానిసలు గానూ, మగ రాయళ్ళకు తొత్తులుగానూ తన "రామ చరిత మానస" లో పదే పదే నిర్భయంగా వర్ణించాడు. ఆడవాళ్ళకు ఏవిధమైన స్వేచ్ఛ లేకుండా చేసి వారిని ఇండ్లలో బందీలుగా వుంచి అవసరమైనప్పుడు వారిని గట్టిగా దండించుట తప్పుకాదని తులసీదాసు ఘంటాపథంగా వక్కాణించాడు.

ఆడుది మహా మూర్ఖురాలు, కపటి, మగవానికి తొత్తు అని పార్వతి, అనసూయ, అహల్య, శబరి, మొదలగు ఆడవాళ్ళచేతనే చెప్పించిన ఘనత ఒక్క తులసీదాసుకే దక్కింది.

శూద్రులనబడే గుహుడు శబరి, నిషాదులు మొదలగు వారిచేత "మేము

శూద్ర కులంలో పుట్టినందుకు మేము పిరికిపందలము, కపటులము, బుద్ధిలేని మూర్ఖులము, దుర్బుద్ధిగలవారము, క్రూరులము, హింసావాదులము, నీచ జాతివారలము, ప్రజలచేత వేదాలచేన నిందింపబడిన పాపాత్ములము" అని చెప్పించి శూద్రులందు తనకున్న ఏవగింపు ను యీ విధంగా తులసీదాసు వెళ్ళకక్కినాడు.

చాదస్తపు శాస్త్రకారుడైన తులసీదాసు, శూద్రులందు తనకుగల అసూయాభావాన్ని అలక్ష్యభావాన్ని నదురూ బెదరూ లేకుండా చాటుకున్నాడు. తులసీదాసు కబీర్‌దాసు వలె కుల వర్గ మత భేదములయొక్క సంకీర్ణతనుండి పైకి అఖండ మానవత్వాన్ని చూడలేకపోయాడు, అంతేకాదు ఆయన అఖండ హిందూత్వాన్ని  కూడా చూడజాలక పోయాడు, ఆయన దృష్టి కేవలం తన బ్రాహ్మణవర్గము యొక్క సంకుచిత ప్రపంచంగానే వుండిపోయింది. ఆయన దానినే తన రామభక్తి ప్రభావంతో సుఖ సంపన్నంగా వుంచటానికే యత్నించాడు

తులసీదాసు ఎన్నో నమ్మశక్యంగాని విషయాలతో తన "రామచరిత మానస" గ్రంథాన్ని నింపివేశాడు. దానిలోని ఏ ప్రసంగానికి కూడా బుద్ధి (తర్కము)తో ఏమాత్రం పొత్తు లేదు. మనస్సులో ఎప్పుడు ఏది తోస్తే దానినల్లా తులసీబాబా వ్రాసాడు.

తులసీ హిందువులలో గుడ్డి నమ్మకాలు, దైవభీతి, బ్రాహ్మణదాస్యము, మతమౌఢ్యము, మొదలగువాటితో పాటు అనేక దేవీ దేవతల విగ్రహారాధనలను కూడా ప్రోత్సహించాడు. త్రేతాయుగంలో అంటే రాముని యుగంలో ఆర్యరుషులు మునులు, తమ మత ప్రచారాన్ని దక్షిణ భారతదేశంలో అంటే ద్రావిడుల ప్రదేశంలో చేయసాగారట. ఆ సందర్భంలో ఆర్యులకు ద్రావిడులకు మధ్య ఘోరమైన పోరాటాలు జరిగాయట, ఆ పోరాటాలలో వేలాది రుషులు, మునులు కూడా ద్రావిడులచేత చంపబడ్డారట, వారి ఎముకలు అక్కడక్కడా గుట్టలుగుట్టలుగా పడివుండెనట, రాముని వనవాస కాలంలో రుషులు రామునికి ఆ ఎముకల గుట్టలను చూపించి రామునిలో ద్రావిడులయందు అసూయాద్వేషాలను రెచ్చగొట్టి నిరపరాధులైన వేలాది ద్రావిడులను రామునిచేత చంపించారట, ఈ విషయాన్ని తులసీదాసు తన "రామచరిత మానస" గ్రంథంలో వ్రాసి తనకు ద్రావిడుల యందుగల అసూయద్వేషాలను పరోక్షంగా వెల్లడించుకొన్నాడు.

ఇంకా టూకీగా చెప్పాలంటే తులసీదాసు శకునాలకు,శాపాలను, వరదానాలను, జ్యోతిష్యమును, కర్మ వాదమును, స్వర్గ నరకాలను, కర్మకాండలను. ప్రజలలో వ్యాపింపజేసి తన వారలను సోమరులుగానూ, పనికి దొంగలుగానూ, తిండిపోతులుగానూ, తేరసొమ్ము తినే పేరయ్యలుగానూ, తయారుచేసివేశాడు, ఇంకనూ అగ్రకులాలవారు ముఖ్యంగా బ్రాహ్మణులు శరీరంతో కష్టపడి పనిచేయ కూడదని దైవమే చెప్పాడని తులసీదాసు పదే పదే తన రామాయణంలో వ్రాశాడు. అందువల్ల బ్రాహ్మణులు కాయకష్టం చేయటం తప్పని ఎంచి కాయకష్టం చేసే కార్మిక కర్షకుల కష్టార్జితం మీద ఆధారపడి బ్రతుకవలసి వస్తోంది. అందుకై బ్రాహ్మణ పండితులు దినము తద్దినము, ఏడూరు, యజ్ఞము తీర్థస్థానాలు, నదీస్నానాలు, తర్పణలు మొదలగు కొన్ని బూటకపు ఆచారాలను కల్పించి ఆ సందర్భాలలో దాన ధర్మాల రూపంలో కాయకష్టం చేసేకార్మిక కర్షకుల కష్టార్జితాన్ని దోపిడీ చేసి దొంగ జీవితాలను గడుపుకొంటున్నారు. తులసీదాసు యీ బూటకాచారాలతో పాటు నరబలులను. సహగమనాన్ని, పాతివ్రత్యాన్ని వరకట్నాన్ని సమర్థించాడు.

తులసీదాసు తన “రామచరిత మానస” గ్రంథంలో అడుగడుగునా తన బ్రాహ్మణవర్గము యొక్క గొప్పతనాన్ని పొగిడాడు. క్షత్రియుల గురించి కొంచెం ప్రస్తావించినా వైశ్యుల సంగతి ఎక్కడా ఎత్తనేలేదు. ఇక శూద్రుల సంగతి వచ్చినపుడు తులసీదాసు వారిని నీచ జాతి వారనియు, మూర్ఖులనియూ పాపాత్ములనియు ఘంటాపథంగా చెప్పాడు.

ఇంతేకాదు తులసీదాసు “రామచరితమానస” గ్రంథంలో రాముని గొప్పతనాన్ని తెలపటానికి బదులు తన బ్రాహ్మణ వర్గంయొక్క గొప్పతనాన్ని తగిన ప్రమాణాలతో సుస్థిరంగా పదికాలాలపాటు వుంచటానికై వ్రాయబడిన కావ్యమే “రామ చరిత మానస” అనే అనుమానం కలుగుతోంది.

“రామచరిత మానస” గ్రంథంలో మౌలికత్వం (సొంతన అనేది) లేనేలేదు. అందులో అనువాదములు, అనుకరణములు ఎక్కువ. తులసీదాసు అనేక సంస్కృత పుస్తకాలనుండి ఎన్నో విషయాలను దొంగిలించినట్లు స్పష్టంగా కన్పిస్తోంది. అందువల్ల తులసీదాసు రామాయణ కావ్యాన్ని అనువాదాల, అనుకరణముల ప్రదర్శనశాల

అని చెప్పవచ్చు కనుక తులసీదాసును గొప్ప కవి అనుటకు బదులు గొప్ప అనువాదకుడన్న తరువాతను గొప్ప భక్తుడనిగాని, కవి అని గాని అనాలి. సూక్తులు కల్పనలు, అలంకారాలు, మొదలగునవన్నీ తులసీదాసు ఎరువు తెచ్చుకొన్నవే

టూకీగా చెప్పాలంటే తులసీదాసు సగం సాహిత్యం అనువాదమే కానీ తులసీరామాయణాన్ని పవిత్ర గ్రంథమని యెంచి దానిని నిత్యమూపారాయణము చేసే చాల మంది పాఠక మహాశయుల మెదడులను మతము దర్మము శ్రద్ధ మూఢనమ్మకాలు, స్వర్గము, నరకము,పుణ్యపాపాలు, మొదలగునవి ముట్టడించి బంధిస్తున్నాయి. అందువల్ల వారు పాపం "రామచరిత మానస"లోని అనేక అసంగతమైన అసంభవమైన విషయాలను గ్రహించజాలక పోతున్నారు.

తులసీరామాయణంలో అన్నిటికంటే ఎక్కువగా అడుగడుగుకు ఆకాశవాణి కన్పిస్తుంది, ఈ ఆకాశవాణి ఎక్కడనుండి ఎవరినుండి వస్తుందో ఎవరికీ తెలియదు.

తులసీదాసు గొప్ప భక్తుడు కవి కావచ్చునేమో కాని సాంఘికదృష్టితో ఆయనంతటి చాదస్తపు మతప్రవృత్తులను గుడ్డిగా నమ్మిన కవి మరొకడు లేడు. శూద్రులను ఆడవాళ్ళను గురించి ఎన్నో నిందోక్తులు తులసీదాసు కావ్యాలలో ముఖ్యంగా "రామచరిత మానస" గ్రంథంలో కోకొల్లలుగా కన్పిస్తాయి. సంఘంలో ఆర్థికంగానూ సాంఘికంగానూ బాధపడే బహుళ పీడత ప్రజల బాధల నివారణోపాయాన్ని గురించి గాక తన బ్రాహ్మణ సంస్కృతి పాడైపోతున్నదనే వ్యథతో తులసీదాసు బాధపడ్డట్లు కన్పిస్తాడు. "రామచరిత మానస" గ్రంథంలోని చాలా విషయాలు సంస్కృతము, ప్రాకృతము, అపభ్రంశము, అవధీ మొదలగు భాషల సాహిత్య గ్రంథాల నుండి సంకలితమైన అనువాదములు మాత్రమే. అందువలన తులసీదాసును సంకలనకర్త అనిగాని, సంపాదకుడు అనిగాని,(అవ) ధీఅనువాదకుడని గాని అనవచ్చు

ఇంకా తేటతెలుగు మాటలలో చెప్పాలంటే తులసీదాసు "స్వయంభూ రామాయణము" నుండి చాలా విషయాలు తస్కరించాడు. తులసీ రామాయణము, పురాణాల "నకలు" మాత్రమే. అందువలన "రామచరిత మానస" గ్రంథాన్ని "హిందీ పురాణము" అని అనాలి.

మనం గమనించవలసిన ముఖ్యవిషయాలు మూడు గలవు తులసీ రామాయణంలో "చాకలి వాని కథ" నిండు చూలాలైన సీతమ్మ తల్లిని అడవికి పంపించిన వృత్తాంతం" "రామలక్ష్మణ సీతాదేవి మొదలగువారి మరణ వృత్తాంతాలు" వ్రాయబడలేదు. కనుక "రామచరిత మానస" గ్రంథాన్ని "తులసీ రామాయణము" అని అనుట అనుచితము కాదు.

కాని కొంతమంది విమర్శకులు తులసీదాసు హిందీ సాహిత్యాకాశ మార్తాండుడనియు, హిందూసమాజానికి ఒక స్థిర రూపం కల్పించిన మహా మనీషి అనియు, హిందూసమాజానికి మార్గదర్శకుడనియు అదేపనిగా ప్రశంసించారు. కాని యీ ప్రశంసా ప్రభంజనంలో తులసీదాసు ఎటువంటి మనిషో అని ఆలోచించిన నాథుడొక్కడు లేరు.

నిజానికి తులసీదాసుని హిందూసమాజానికి మార్గదర్శకుడనుటకంటే మార్గ భ్రష్టుడనుట ఎక్కువ ఉచితంగా కన్పిస్తోంది. ఎందుకనగా ఆ రోజులలో విదేశస్థుల పాదాల చెప్పుల క్రింద టెంకెపురుగుల్లాగ నలిబిలి అయిపోతున్న హిందువుల పురుషార్థాన్ని (పురుష ప్రయత్నాన్ని) బోధించక "రామం శరణం గచ్ఛామి" అనే గ్రుడ్డి నమ్మకాన్ని ప్రోత్సహించే శుష్క ఉపదేశాన్ని బోధించిన తులసీదాసుని ప్రజాకవి అనిగాని, హిందూసమాజ మార్గదర్శకుడని గాని ఎలా అనగలిగారో ఆ విమర్శక మహాశయులకే తెలియాలి.

కనుక హిందూ సమాజ భ్రష్టుడైన యీ సన్యాసి కవియొక్క సాహిత్యగుట్టు రట్టుచేసి దాని నిజస్వరూప లక్ష్యాలను చదువరుల ముందుంచుటే ఈ చిన్న పొత్తము యొక్క ముఖ్యోద్దేశము. కనుక వివేకవంతులైన చదువరులు అంధవిశ్వాసాన్ని ఆవలకు నెట్టి, "రామచరిత మానస" గ్రంథాన్ని చదివి, హిందూసమాజానికి ముఖ్యంగా శూద్రులు, ఆడవాళ్ళు వగైరాలకు తులసీదాసు చేసిన గొప్ప అపచారాన్ని తెలిసికొన గలరని ఆశిస్తున్నాను.